www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 అక్టోబర్ 2025

వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

జడివాన..స్తంభించిన జనజీవనం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- రైల్వేకోడూరులో అత్యధికంగా 178 మిల్లీమీటర్ల వర్షపాతం
- టమోటా, వరి రైతుల ఆశలపై నీళ్లు
- కదిరమ్మ చెరువుకు గండి
- మూతపడిన విద్యా సంస్థలు
- బురదమైన గ్రామీణ రోడ్లు
- మరో 4 రోజులు అల్పపీడన ప్రభావం
- అప్రమత్తమైన జిల్లా అధికారులు

జిల్లాలో జడివాన కురుస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం నుండి బుధవారం సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా చలిగాలులతో కూడిన వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. జిల్లా రైల్వేకోడూరులో అత్యధికంగా 178 మి.మీపైగా వర్షపాతం నమోదైంది. ఫలితంగా జిల్లాల్లోని టమోటా, బొప్పాయి, వరి, ఇతర పంటలకు నీరు చేరుతోంది. ఫలితంగా జిల్లాలోని వేలాది ఎకరాల్లో టమోటా దిగుబడులు మచ్చల బారిన పడడం, ఇతర పంటలు నేలకొరగడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా రబీలో విత్తనం అల్పపీడనం దాటికి కొట్టుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. మూడు రోజులుగా వర్షాలు కురవడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేకపోవడంతో ఇబ్బందులు గురవుతున్నారు. కొన్ని మండలాలలో చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-రాయచోటి/మదనపల్లె అర్బన్/నందలూరు/రాజంపేట

జిల్లాల్లో అల్పపీడనం ప్రభావం కొనసాగుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న జడివాన కారణంగా జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 30 మండలాల్లో ఆశించిన వర్షపాతం నమోదైంది. రాజంపేట డివిజన్ పరిధిలోని రైల్వే కోడూరులో 178 మిల్లీమీటర్లు, ఓబులవారిపల్లిలో 90, చిట్వేలిలో 77.8, పుల్లంపేటలో 35.4, రాజంపేటలో 45.8, ఓబులవారిపల్లిలో 90 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు ఉప్పొంగాయి. పోలీస్, రెవెన్యూ యంత్రాంగం నదులు, వాగుల దగ్గర పోలీసులను మోహరించింది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము, టోల్‌ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు.

వరి పంట నష్టం: జిల్లా పరిధిలోని నందలూరు, రాజంపేట మండలాలలో కోతకు సిద్ధంగా ఉన్న 60 ఎకరాల్లో వరి పంట వర్షానికి దెబ్బ తినడంతో రూ.33 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నందలూరు మండలంలోని పాటూరులో 10 మంది రైతులకు సంబంధించిన 20 ఎకరాల్లో వరి పంట దెబ్బతినడంతో రూ.11 లక్షల ఆస్తి నష్టం జరిగింది. రాజంపేట మండలంలోని అప్పరాజుపేట, తాళ్లపాకలో 13 మంది రైతులకు సంబంధించిన 40 ఎకరాల్లో వరి పంట దెబ్బ తినడంతో రూ.22 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈ వర్షం ఇలాగే కొనసాగితే నందలూరు, రాజంపేట మండలాలలో రైతులు సాగు చేసి కోతకు సిద్ధంగా ఉన్న 1,320 ఎకరాల్లోని వరి పంట చాలావరకు నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మదనపల్లె : కదిరమ్మచెరువుకు గండి మరమ్మతులు చేయిస్తున్న ఎమ్మెల్యే

ప్రజల అప్రమత్తంగా ఉండాలి : బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉండడంతో జిల్లాలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌పి ధీరజ్ ఆధ్వర్యంలో పోలీసులతో పాటు జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమై వరదలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు తదితర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 08561-293006 ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వరద సమాచారాన్ని తెలుసుకుంటున్నారు.

మదనపల్లె నియోజకవర్గంలో వర్షాల వల్ల జనజీవనం స్తంభించింది. గురువారం భారీ వర్షాలు పడుతాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యాశాఖ విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. పెద్ద వర్షం కాకపోయినప్పటికీ జడివానతో చాలామంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. గ్రామీణ రోడ్లు బురదమయమయ్యాయి. వంకలు, వాగులు పొంగిపొర్లాయి. వర్షపనీరు రోడ్లపై చేరడంతో వాహనదార్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని కదిరమ్మ చెరువుకు గండి పడింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పందించి చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. స్థానిక సర్పంచ్, ఇరిగేషన్ అధికారులతో సంప్రదింపులు జరిపి, గ్రామస్తుల సహాయంతో చెరువు గండిని పూడ్చి వేశారు. పరిసర ప్రాంతాల్లోని వెంకటమ్మ చెరువు, మేడిపల్లి చెరువులను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దని తెలిపారు. పిల్లలను ఇళ్లకే పరిమితం చేయాలన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదొర్కొనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. మదనపల్లె, చెంబకూరు రోడ్డు బురదమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌లోని 08571231181 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

నందలూరు : నేలకొరిగిన వరి పంట

మదనపల్లె : బురదమయమైన చెంబకూరు రోడ్డు

ప్రయివేట్‌కు ధీటుగా ప్రభుత్వాస్పత్రి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రాబోయే రోజులలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రిని ప్రయివేట్ ఆసుపత్రులకు ధీటుగా అభివృద్ధి చేస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుతాసుపత్రిలో అభివృద్ధి కమిటీ సంఘం, ఆస్పత్రి సూపరింటెండెంట్ వారు ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజులలో ప్రభుత్వాసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి కమిటీ చైర్మన్, సభ్యులు దుశ్శాలవా పుష్పగుచ్చాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్ కుమార్, ప్రధాన వైద్యులు, అభివృద్ధి కమిటీ చైర్మన్, సభ్యులు, ఎపిఐఐసి డైరెక్టర్ కొండా భాస్కర్ రెడ్డి, టిడిపి నాయకులు రవీంద్రారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షుడు బివి రమణ

26న మున్సిపల్ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

రాయచోటి పట్టణంలో ఈ నెల 26న నిర్వహించే ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై రాజీ పడకుండా యూనియన్ పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. రూ.3 వేల నుండి రూ. 21 వేలు వరకు వేతనం యూనియన్ అండతో పోరాటాలు చేసి సాధించుకున్నామన్నారు. మట్టి ఖర్చులు వస్తున్నాయని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వర్కర్స్‌కు ఇంజినీరింగ్ విభాగం వారికి రూ.3500 వేతనం పెరిగిందంటే యూనియన్ నిరవధిక పోరాటాలే కారణమన్నారు. రెగ్యులర్ చేస్తామన్న పాలకుల హామీ, హక్కు సాధన కోసం యూనియన్ ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం కొత్తగా పని గంటలు పెంచి కార్మికులకు కష్టాలు పెంచుతుందని ఈ నేపథ్యంలో మహాసభలో మున్సిపల్ వర్కర్స్ ఎదుర్కొనే స్థానిక జిల్లా సమస్యలను చర్చించి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. పాలకుల మీద ఒత్తిడి తేవడానికి దీర్ఘకాలిక ప్రణాళిక తయారు చేస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం బంగ్లా వద్ద కళాశాల మైదానం నుంచి బస్టాండ్ మీదుగా ప్రీతం కళ్యాణ మండపం వరకు కార్మి ఃకుల ర్యాలీ నిర్వహి స్తామన్నారు. ర్యాలీకి రాజంపేట, మదనపల్లి, బి. కొత్తకోట మున్సి పాలిటీలకు చెందిన కార్మికులు సకాలంలో హాజరుకావాలని కోరారు. మహాస భలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా నాయకు లు సామ్రాజ్యం, సిఐఐయు జిల్లాప్రధాన నాయకత్వం హాజరవుతారన్నారు. సమావేశంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి సి. రాంబాబు, ఉపాధ్యక్షులు చెన్నయ్య, శంక రయ్య నాయకులు దేవా, శేఖర్, బాలాజీ, గురువర్ధన్ పాల్గొన్నారు

రాజంపేట : పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-రాజంపేట

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. బుధవారం రాజంపేట పట్టణ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పనితీరును సమీక్షించారు. పారదర్శకత, వేగవంతమైన న్యాయం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. పలు కేసులకు సంబంధించిన రికార్డులను, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను సమీక్షించి పలు ముఖ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేసి బాధితులకు త్వరగా న్యాయం అందించడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, వినయంగా వ్యవహరించి పోలీస్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంచాలని చెప్పారు. నేరాల విచారణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పెంచాలని, గస్తీ చర్యలను మరింత బలోపేతం చేయాలని, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా తక్షణమే నమోదు చేయాలని ఆదేశించారు. సిబ్బంది క్రమశిక్షణ, ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ప్రజల సమస్యలను ఆలకించి వారికి తక్షణ సహాయం అందించడమే పోలీస్ విధి అని పునరుద్ఘాటించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, మరికొన్ని మెరుగుదల కోసం సూచనలు చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, సిఐ నాగార్జున, ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్వేలు:పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ బ్రిటిష్ కాలం నాటి పాత భవనం కావడంతో స్టేషన్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి సిసిటిఎన్ఎస్‌లో అన్ని కేసుల వివరాలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నమోదైన కేసుల విచారణ వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని అన్నారు. ఫిర్యాదు దారులు, సాధారణ ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. జిల్లాకు అనుంపల్లి చివరి చెక్‌ఫోస్టని నిరంతరం పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని, అక్రమ కార్యకలాపాలను అరికట్టాలని ఆదేశించారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నవీన్ బాబు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, క్రీడా విభాగం ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి జాతీయ క్రీడా పురస్కారాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అర్జున అవార్డు, అర్జున లైఫ్ టైం అవార్డు, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు, ద్రోణాచార్య అవార్డు, ద్రోణాచార్య లైఫ్ టైమ్ అవారు), రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహక పురస్కార్ అవార్డుల కోసం అర్హత కలిగిన క్రీడాకారులు, కోచ్‌లు , సంస్థ లు www.dbtyas-sports.gov.inలో దరఖాస్తును చేసుకోవచ్చున్నారు. ఈనెల 28న రాత్రి 12లోపు నమోదు చేసుకోవచ్చుని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లు, సంఘాలకు సంబంధించిన వివరాలపై పోర్టల్‌లో లభ్యం అయ్యే అవార్డు మార్గదర్శకాలు పరిశీలించి గడువులోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలోని తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.apsports.in వెబ్ సైట్‌ను సందర్శించాలని చెప్పారు.

మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

గుణాత్మక విద్యను అందించాలి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జిల్లాలోని కెజిబివి, ఎపి మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సంద్రంగా అయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడూ తపనతో కృషి చేయాలని సూచించారు. కెజిబివి, ఎపి మోడల్ స్కూల్స్ ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యా విధానాలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులలో చదవడం, రాయడం, గణితంలోని చతుర్విధ ప్రక్రియలు ప్రతీ ఒక్కరికీ సంపూర్ణంగా వచ్చేటట్లు శ్రద్ధ చూపాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు సమయాన్ని కేటాయించి కృషి చేయాలని సూచించారు. పదవ తరగతి వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పాల్ నోడల్ ఆఫీసర్ అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అసాదుల్లా మాట్లాడుతూ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పిఎల్ ల్యాబ్స్‌ను సమర్థవంతంగా ఉపయోగించి విద్యార్థుల నేర్చుకునే నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లు కరుణాకర్, జనార్ధన్, భాస్కర్, చంద్రశేఖర్, యశోద పాల్గొన్నారు.

బిటి కళాశాలకు పూర్వవైభవం తీసుకొద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చారిత్రాత్మక బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్వ వైభవం తీసుకొద్దామని ఎమ్మెల్యే షాజహాన్ బాష పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి ఉచ్చతర్ యోజన పథకం కింద మంజూరైన 70 అధునాతన కంప్యూటర్లను బుధవారం ఎమ్మెల్యే సాజహాన్ బాషా ఆవిష్కరించారు. ఆయన కళాశాలకు చెందిన విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిటి కళాశాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నదని, ఆ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తోపాటు తామందరిపైన ఉందన్నారు. అనంతరం కళాశాలలో వసతులు, విద్యా బోధన పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ ల్యాబ్ కు మ్యాట్, కళాశాల అవరణకు పదిలైట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలే శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వారు నిర్వహించిన యువతరంగం పోటీలలో బహుమతులు పొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పతకాలు అందజేశారు. హిందీ వక్తృత్వ పోటీలలో థర్డ్ ప్రైజ్ పొందిన విద్యార్థిని దివ్యవాణి, ర్యాలీలో పాల్గొని సెకండ్ ప్రైజ్ పొందిన విద్యార్థి బృందానికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గన్నవరం శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సిఎస్ శైలజ, డాక్టర్ డేరంగుల శ్రీనివాసులు, డాక్టర్ జి.చిన్నారెడ్డి తదితర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దూరం కానున్న వైద్యం : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పిపిపి విధానంతో పేద ప్రజలకు వైద్యం దూరం కానుందని మదనపల్లె నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. మదనపల్లె మండలం, బొమనచెరువు, మాలేపాడు పంచాయతీలలో బుధవారం మెడికల్ కళాశాలలను ప్రయివేటుకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను, సంతకాల సేకరణ ఫారాన్ని ఆవిష్కరించారు. అనంతరం సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, జడ్‌పిటిసి ఉదయ్ కుమార్, వెలుగు చంద్ర, దండు కరుణాకర్ రెడ్డి, షేక్ ఇరాన్, గణేష్, మహేష్ కొత్తపల్లె, ఆనంద్‌రెడ్డి, మల్లికార్జున, నర్సింహులు, చలపతి, కాడి రామచంద్రారెడ్డి, గంగూల్ నాయుడు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లోనే ప్రయాణాలు చేయాలి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో, దక్షిణాంధ్ర ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులలో మాత్రమే ప్రయాణాలు చేయవలసిందిగా జిల్లా ప్రజలకు జెసి ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. బుధవారం సాయంత్రం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి హోమ్‌శాఖ మంత్రి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుండి జెసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీస్, అగ్నిమాపక శాఖ, తదితర బలగాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జెసి జిల్లా రహదారులు, భవనాల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, విద్యాశాఖ, విద్యుత్ శాఖ, అగ్నిమాప, విపత్తుల నిర్వహణ శాఖ తదితర శాఖల అధికారులకు భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. జిల్లాలో వాగులు వంకల దగ్గర ఉన్న రహదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని రహదారులు, భవనాలు శాఖ అధికారిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రమాదంగా ఉండాలని తగిన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. సహాయక చర్యలకు కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను 08561-293006 సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ర్యాలీని జయప్రదం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్రంలోని వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి నిరసనగా ఈ నెల 28న రాజంపేటలో నిర్వహించే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే అకేపాటి అమర్నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాయచోటిలోని జిల్లా వైసిపి కార్యాలయంలో మండల గ్రామ పంచాయతీల వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో నిర్మించిన వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేస్తే తిరిగి తమ ప్రభుత్వం రాగానే ఆ ప్రభుత్వానికి అప్పజెప్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నో అపద్ధపు హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన వాటిని నీరుగారుస్తూ ప్రజలను మోసం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను వారి సొంత మనుషులకు ధారాతత్తం చేస్తున్నారని మండిపడ్డారు. వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత మళ్లీ స్వాధీనం చేసుకుంటామన్నారు. సమావేశంలో వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు పవన్ కుమార్, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగభూషణం, సర్పంచ్‌లు నాగిరెడ్డి, గోపినాథ్ రెడ్డి, రవికుమార్, శివరాం, నరసింహులు, మండల పార్టీ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

రేపు ఎన్‌జిజిఒ రాష్ట్ర నాయకులు రాక

ప్రజాశక్తి- రాయచోటి

ఎపి ఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ మొదటి సారి రాయచోటికి వస్తున్నారని, వారి పర్యటన విజయవంతం చేయాలని ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బి. నివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి పి. నిత్య పూజయ్య, రాయచోటి అధ్యక్షులు డి. వెంకటేశ్వర్ రెడ్డి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి భారీ ర్యాలీతో ఎన్‌జిజి హోమ్ వరకు వెళ్లి అనంతరం సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు అధిక సంఖ్య లో పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు అడివిలోపల్లి విద్యార్థి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అండర్-14 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని అడివిలోపల్లెకు చెందిన విద్యార్థి రాజ్ రోహన్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఆగస్టు నెలలో తూర్పు గోదా వరి జిల్లా రాజమండ్రిలో జరిగిన 14 ఏళ్లలోపు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో వశిష్టస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కె.రాజ్ రోహన్‌రెడ్డి ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 26 నుంచి మధ్యప్రదేశ్ లోని నారాయణపూర్ జరిగే జాతీయ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున పాల్గొంటారని జిల్లా అధ్యక్ష కార్యదర్శి దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఉపాధ్యక్షుడు జాన్ కమలేష్, సంయుక్త కార్యదర్శులు మహేంద్ర నాయక్, పిఇటి అంజనప్ప, మహేంద్ర, అభిలాష్ రాజ్ రోహన్‌రెడ్డిని అభినందించారు.

'మిట్స్'ను సందర్శించిన యుఎస్‌ఎ ప్రతినిధులు

ప్రజాశక్తి-మదనపల్లె : మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని ఎమర్జింగ్ టెక్నాలజీస్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు బుధవారం సందర్శించారని వైస్ ఛాన్సిలర్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ బృందంలో యూనివర్సిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ సిఇఒ ప్రసాద్ మావుదురి, విద్య, కార్పొరేట్ అలయన్స్ అసోసియేట్ వైస్ ఛాన్సలర్ చంద్ర దశక్ ఉన్నారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుత విద్యాభాగస్వామ్యాలు, పరిశోధన కార్యక్రమాలు, అధ్యాపక మార్పిడి, విద్యార్థుల అభివృద్ధి అవకాశాలు వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించడం ఈ సందర్శన ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సందర్శనలో భాగంగా యూనివర్సిటీ పరిపాలన, అధ్యాపకులతో ఇంటరాక్షన్ సెషన్ ఏర్పాటు చేశారు. సిఇఒ ప్రసాద్ మావుదురి మాట్లాడుతూ మిట్స్‌లోని విద్యా మౌలిక సదుపాయాలు, వినూత్న బోధనా పద్ధతులు, పరిశోధన సంస్కృతి, ప్రపంచ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న విధానాలను ప్రశంసించారు. సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం, విద్యార్థులకు అంతర్జాతీయ అవగాహన పెంపొందించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ మాట్లాడుతూ యూనివర్సిటీని సందర్శించి విలువైన సమయం కేటాయించిన ప్రతినిధులకు మనఃపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్ కుమార్, డీన్ ఇంజనీరింగ్ డాక్టర్ దీపాంకర్ రాయ్, డాక్టర్ నందకుమార్ లు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లి చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను కొంత మంది ఆక్రమించుకొని వాటిని లేఅవుట్లుగా మార్చి కోట్లాది రూపాయలకు విక్రయి స్తున్నారనీ అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ సేవాసమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చెంచర్ల ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం ఆక్రములకు గురైన భూములలో వెళ్లి పరిశీలించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ నరసింహులును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి గ్రామంలోని 217 సర్వే నెంబర్ల ప్రభుత్వ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. రెవె న్యూ అధికారులు ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెబిఎస్ఎస్ అనమయ్య జిల్లా అధ్యక్షులు లక్ష్మీ శశిధర్, గంగాధర్, అబ్బాస్, అలీఖాన్ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని ఎంపిడిఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు అన్నారు. బుధవారం రాచవేటివారిపల్లె గ్రామ సచివాలయాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికలను, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హుల, అనర్హుల జాబితాలను తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాలలో సిబ్బంది పనితీరు, ప్రజలతో వారి ప్రవర్తన పై ఆరా తీశారు. ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా హాజరు వేయాలని, సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులపై సచివాలయం నుంచి బయట వెళ్లే ఉద్యోగులు మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రజలకు శుద్ధమైన తాగునీరును ప్రతిరోజు అందించాలన్నారు. గ్రామాలలో చెత్తను తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు అనారోగ్యానికి గురవుతుంటారని వైద్య ఆరోగ్య సిబ్బంది వారికి అందుబాటులో ఉంటూ తగు సూచనలు చేస్తూ అవసరమైన మందులను పంపిణీ చేయాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్లు కూడా పాడి రైతులకు వర్షా కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై తెలియజెప్పాలని సూచించారు. సచి వాలయ ఉద్యోగులు ప్రజలతో సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-కలికిరి

ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పీలేరు ప్రభుత్వా సుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం హర్షించ దగ్గ విషయమని పీలేరు నియోజకవర్గ టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కె. అగస్టీన్బర్ అన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ కోసం దూరప్రాంతాలకు వెళ్లి తీవ్ర ఇబ్బం దులు పడుతున్న క్రమంలో ఇటీవల ఎమ్మెల్యే అసెంబ్లీలో డయాలసిస్ చేసుకుంటున్న వారి పరిస్థితిని వివరించి డయాలసిస్ సెంటర్లను చేయాలని ప్రభుత్వాన్ని కోరారని చెప్పారు. స్పందించిన వైద్యఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ రాష్ట్రంలో ఏడు డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అనుమతిచ్చారని పేర్కొన్నారు. పీలేరులో రూ.75లక్షల వ్యయంతో ఒక సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. ఇక్కడ రోజుకు మూడు సెషన్లలో రోజుకు 15 మంది కిడ్నీ వ్యాధులున్న వారు రక్తశుద్ధి చేసుకునేం దు కు అవకాశం కల్పించనున్నారని తెలిపారు. ఈ విషయం తెలిసిన పీలేరు నియోజకవర్గ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాయచోటి

రానున్న మూడు రోజులు ప్రజల పరిమితంగ ఉండాలని ఫైర్ ఆఫీసర్ వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీగా కురుస్తున్న వర్షాల వరదల్లో చిక్కుకుంటే ఫైర్ స్టేషన్ 101 సమాచారం ఇవ్వండి, రెస్క్యూ టీంతో ఎదుర్కొంటాం న్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడైనా వరదలు సంభవించి, ప్రాణాపాయ స్థితిలో చిక్కు కుంటే వెంటనే ఫైర్ స్టేషన్ 101 కు సమాచారం అందించాలని తెలిపారు. **కలకడ:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని అన్ని పంచాయతీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ భాను ప్రసాద్, ఎస్ఐ రామాంజనేయులు సూచించినట్లు తెలిపారు. మండలంలోని ముడియం వారిపల్లె, ఏనుగొండ పాలెం, సచివాలయం తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వర్షాలు అధికంగా కురుస్తుండడంతో ఎంపిడిఒ, ఎస్ఐ పలు ప్రాంతాలను సందర్శించారు.వర్షం తీవ్రత పెరుగుతుండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. అవసరమైతే పోలీసులకు 9440900713 సమాచారం అందించాలని సూచించినట్లు తెలిపారు. **తంబళ్లపల్లి:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల పంచాయతీ కార్యదర్శులు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ బాపూజీ పట్నాయక్ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో వర్షాల పట్ల ముందస్తు తీసుకోవాల్సిన చర్యలు జాగ్రత్తలు అప్రమత్త అంశాలపై పంచాయతీ కార్యదర్శులు ఇంజినీరింగ్ అసిస్టెంట్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో పెద్దేరు, చిన్నేరు, దప్పలగుట్ట ప్రాజెక్టులు పలు చెరువులో నీటిమరువలు పోతున్నాయి. పలుచోట్ల ఏర్లు ప్రవహించడంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో థామస్‌రాజు, డిప్యూటీ ఎంపిటిఒ ఈశ్వర్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ సుజాత, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. **రాజంపేట :** ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పింఛ ప్రాజెక్టు నుండి అధికారులు దిగువకు నీటిని వదలడంతో రాజంపేట నందలూరు, పెనగలూరు మండల రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. బాలరాజుపల్లె ఏటి వద్ద నీరు ఎక్కువగా ప్రవహిస్తుండడంతో ఎవరూ నదిలోకి వెళ్లకుండా బందో బస్తు నిర్వహిస్తున్నారు. విఆర్ఒ రమణరావు, పోలీసుసిబ్బంది పహారా కాస్తున్నారు.

క్రీడా పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర క్రీడా అభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వ ర్యంలో సెంట్రల్ సివిల్ సర్వీస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డ్ వార్షిక క్రీడా పోటీలు 2025-26లో పాల్గొనుటకు అర్హత కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసేందుకు జిల్లా స్థాయిలో ఈనెల 28 నుండి 30 వరకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికల ద్వారా రాష్ట్ర స్థాయి పోటీలు నవంబర్ 5 నుండి 8 వరకు ఉంటాయన్నారు. ఈ క్రీడా పోటీల్లో మొత్తం 19 క్రీడా విభాగాలలో అథ్లెటిక్స్, బాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, వాలీ బాల్, ఖోఖో, యోగా, ఉత్తమ శరీర నిర్మాణం డాన్స్, మ్యూజిక్, మార్షల్ ఆర్ట్స్ తదితర అంశాల్లో పోటీలుంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి సివిల్ సర్వీస్ టోర్నమెంట్ లో పాల్గొనేవారు తమ పేర్లను ఈనెల 27న సాయంత్రం 5:00 గంటల లోపు జిల్లా క్రీడా కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికలు డిఎస్ఎ క్రీడా మైదానంలో నిర్వహిస్తామని, ఇతర వివరాల కోసం 9154731106లో సంప్రదించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ డిపార్ట్‌మెంట్ ఐడి కార్డు, ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

నిమ్మనపల్లి : బహుదా ప్రాజెక్టు భారీగా చేరుతున్న వర్షపు నీరు

నిండుతున్న బహుదా ప్రాజెక్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని బహుదా ప్రాజెక్టు నిండు తుండడంతో ఎంపిడిఒ రమేష్‌బాబు, తహశీల్దార్ తపస్విని, ఎస్ఐ తిప్పేస్వామి క్షేత్రస్థా యిలో పరిశీలించారు. బుధవారం బహుదా ప్రాజెక్టును వారు పరిశీలించి ఎఇ శ్రీహరి రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీ వల కురిసిన వర్షాలకు ప్రాజెక్టుకు ఎగువన ఉన్న యాతాల వంక, మదనపల్లె బహుదా కాలువ నుంచి వరద నీరు చేరుతున్నాదని అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి వరద నీరు పెరుగుతుండడంతో ప్రాజెక్టులో కూడా నీటిమట్టం పెరుగుతోందన్నారు. పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిండాలంటే మరో నాలుగు అడుగులు నీటిమట్టం పెరగాల్సి ఉందన్నారు. బహుదా ప్రాజెక్టు వద్ద అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొన సాగిస్తున్నారని, సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వర్షాలు పడు తున్నందున ప్రజలు, సందర్శకులు ప్రాజెక్టు వద్దకు రావద్దన్నారు. సరదాల కోసం నీటిలో దిగితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. బహుదా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుతున్నందున దిగువనున్న ప్రజ లను, పశువుల కాప రులను ముందస్తుగా అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ అధికారులు మండలంలోని బహుదా ప్రాజెక్టు వద్ద, చెరువులు, కుంటలు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, సిబ్బందని అప్రమత్తం చేసి నీటి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలో బుధవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. బోటుమీదపల్లి పంచాయతీ నందుగల పుల్లంగెరును పరిశీలించి మండల ప్రజలకు తగు సూచనలు, సలహాలు తెలిపారు. ప్రజలు, మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా నిరంతరం అందు బాటులో ఉండి ప్రజల సమస్యలను తీరుస్తానని మండల ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో నిండిన 15 చెరువులు

కలకడ : మండలంలో 118 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉండగా వాటిలో 15 చెరువులు వంద శాతం నీటితో నిండి మొరవలు పోతున్నాయని ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. మండలంలోని కొన్ని చెరువులను సందర్శించినట్లు తెలిపారు. 15 చెరువులు నూరు శాతం నీటితో నిండగా మిగిలినవి 75 శాతం నుంచి నూరు శాతం 23 చెరువులు నిండినట్లు తెలిపారు. 50 శాతం నుంచి 75 శాతం 25 చెరువులు నిండినట్లు తెలిపారు. ఈ చెరువులలో కొన్నింటిని ఇరిగేషన్ స్వర్ణలత , ఎంపిడిఒ, ఎఇ ప్రణయ్, సంబంధిత పంచాయతీ కార్యదర్శిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విఆర్ఒలు పరిశీలించినట్లు తెలిపారు. చెరువుల్లో ముడియంవారిపల్లి లోని కొండ్రెడ్డి చెరువు, నవాబుపేట పెద్దచెరువు, కదిరాయ చెరువు గ్రామంలోని పెద్ద చెరువు, దిగువ పాలెంలోని నాయని గుంట చెరువులను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పడిన వర్షం వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. చెరువులు నదుల వద్ద ప్రస్తుతానికి రాకపోకలు ఎలాంటి ఇబ్బంది లేదని ఆయన ప్రజలకు సూచించినట్లు తెలిపారు.

చెరువు, వంతెనలు పరిశీలించిన సబ్ కలెక్టర్

రైల్వేకోడూరు : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలను, చెరువులు, నిర్మాణంలో ఉన్న వంతెనలను సబ్ కలెక్టర్ భావన స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. శెట్టిగుంట యానాదికాలనీ, సెట్టిగుంట చెరువు, రెడ్డివారిపల్లె వద్ద నూతనంగా నిర్మాణంలో ఉన్న వంతెన, వెంకయ్యస్వామిగుడి సమీపంలో నిర్మాణంలో ఉన్న వంతెన పనులను, లోతట్టు ప్రాంతాలను తనిఖీ చేశారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెడ్డివారిపల్లె మార్గంలో వంతెన నిర్మాణంలో ఉన్నందున తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు వరద నీటికి కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ హేమ సుందర్, ఇరిగేషన్ శాఖ డిఇ వినోద్‌కుమార్, తహశీల్దార్ అమర్నాథ్, ఎంపిడిఒ నాగిరెడ్డి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పుల్లంపేట: పుల్లంగేరును పరిశీలిస్తున్న తహశీల్దార్, ఆర్ఐ

కలకడ : నవాబుపేట వద్ద పెద్దచెరువును పరిశీలిస్తున్న ఎంపిడిఒ

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం : డిఎస్‌పి

మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణమోహన్

ప్రజాశక్తి-కలకడ

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి వాటిని నివారించేందుకు జిల్లాలో పోలీసుయంత్రాంగాన్ని ఎస్‌పి అప్రమత్తం చేశారని రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కలకడలో ఉన్న పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాల వద్ద నిరంతర నిఘా ఉంచాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరారు. జిల్లాలో భారీ ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని, దయచేసి ప్రజలు నదులు, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయకూడదని, సెల్ఫీలు తీసే ప్రయత్నాలు చేయరాదని, హెచ్చరికలు జారీ చేయా లని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడ గాని మత్తు పదార్థాల విక్రయాలు చేసిన యెడల స్థానిక పోలీసులకు ఫిర్యాదులు చేయాల న్నారు. యువత మత్తుపదార్థాలతో తప్పుదోవ పడుతున్నారని, వాటిపై గట్టిగా ఉంచా లని పోలీస్ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. మండలంలో నాటు సారా విక్ర యాలు, అమ్మకాలు జరిగినచో వారిని పసిగట్టి నియంత్రించాలన్నారు. కోడిపందేలు, పేకాట, తదితర అసాంఘిక కార్యక్రమాలపై గట్టిగా ఉంచి వాటిని నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. మండల కేంద్రమైన కలక డలో ట్రాఫిక్ నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని, మైనర్లు వాహనాలు నడిపినచో వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, ట్రైన్ ఎస్క్మి హారిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సయ్యద్‌షావలి దర్గా దారి మూసివేత

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లిలోని అహోబిలనాయిని చెరువు వద్ద ఉన్న సయ్యద్ షావల్లి దర్గా కట్టకు దారిని తాత్కాలికంగా మూసివేసినట్లు తహశీల్దార్ తపస్విని తెలిపారు. బుధవారం ఆర్ఎస్ డిటి సిరాజుద్దీన్, ఆర్ఐ రమేష్, ఎస్ఐ తిప్పస్వామి లతో కలిసి అహోబిలనాయుని చెరువు మొరవను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ నపల్లిలోని అహోబిలనాయుని చెరువు పూర్తిస్థాయిలో నిండి మొరవ పోతు న్నందున నీటి ప్రవాహాన్ని ఇక్కడ పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు. చెరువు కటపై సయ్యద్ షావలి దర్గా ఉండడంతో ఇక్కడికి ప్రతి రోజూ అధిక సంఖ్యలో సందర్శకులు తరలి వస్తుంటారని చెప్పారు. దర్గాకు వెళ్లే దారిలోనే చెరువు మొరవ వస్తుండడంతో నీటి ప్రవాహం వలన ప్రమాదాలు సంభ వించే అవకాశముందన్నారు. చెరువు మొరవ నీటి ప్రవాహం తగ్గే వరకు తాత్కా లికంగా ఈ దారిని మూసివేస్తున్నామని తెలిపారు. జెసిబి సాయంతో సయ్యద్ షావలి దర్గా దారిని మూసివేయించామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి దర్గాకు వచ్చే భక్తులు దీనిని గమనించి అధికారులకు సహకరించాల న్నారు. స్థానిక ప్రజలు కూడా చేపల వేటకు, ఈత సరదాలకు చెరువులోకి కానీ, నీటి ప్రవాహంలోకి కానీ వెళ్ళవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ ఎస్ డిటి సిరాజుద్దీన్, ఆర్ఐ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా దారిని జెసిబితో మూసి వేయిస్తున్న తహశీల్దార్ తపస్విని

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి : డిప్యూటీ హెచ్ఇఒ

అంటు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-పీలేరు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఆరోగ్యం పాడవకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటిద్దామని తలుపుల డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య తెలిపారు. పట్టణ శివారులోని బోడుమల్లువారిపల్లి పంచాయితీ, గాండ్లపల్లెలో 'తుఫాను-జాగ్రత్తలు 'అనే అంశంపై ప్రజలకు అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి కాలుష్యం కారణంగా డయేరియా, వాంతులు, కామెర్లు, టైఫాయిడ్ తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరిం చారు. మనం ఆ రోగాల బారిన పడకుండా ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వా నియంత్రణా చర్యలు తీసు కోవాలన్నారు. ప్రత్యేకించి హై రిస్క్ గర్భిణులు, చిన్నపిల్లలు అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరుబయటి ఆహార పదార్థాలు తినకుండా, ఇంటి తాజా ఆహారం తింటూ సురక్షిత నీరు తాగాల న్నారు. చేతుల శుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకుందామన్నారు. వర్షాల గురించిన వదంతులు నమ్మకుండా అధికారిక నిజాలు ఆచరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు రేణుక, ఉమ, సిహెచ్ఒ రాజేశ్వరి, డిఇఒ సుధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నమండెం ఎంపిడిఒగా సురేష్‌బాబు

ప్రజాశక్తి-చిన్నమండెం : మండల నూతన ఎంపి డిఒగా టి.సురేష్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాయచోటి యుఆర్‌డిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పింఛన్లు, ఇతర సమస్యలుంటే తమ దృష్టికి తీసుక వస్తే వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం:'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట : సమస్య మీది పరిష్కారం మాది అనే నినాదంతో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు.స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక మంది ప్రజలు తమ సమస్య లను చమర్తి దృష్టికి తీసు కువచ్చారు. ఈ సందర్భంగా సమస్యలపై అధికారు లతో మాట్లాడి అప్ప టికప్పుడే పరిష్కారం అయ్యేవి వెంటనే పరిష్కరించాలని, సమయం తీసుకునే సమస్యలను చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల ప్రకారం ప్రజా దర్బార్ వేదికగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల రూరల్ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జగన్‌మోహన్‌రాజు

మానసిక వికాసం ఎంతో అవసరం

ప్రజాశక్తి- కలకడ

విద్యార్థులకు మానసిక వికాసం ఎంతో అవసరమని రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ పీఎంయు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఛాయేంద్రకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కలకడ కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును, రికార్డులను తనిఖీలు చేసి, ఆహార నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మమేకమై మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే సాధనమని, ఆ సాధనను జయించాలంటే మానసిక దృఢత్వం తప్పనిసరిగా పెంపొందించు కోవాలన్నారు. విద్యార్థులు మానసికంగా తయార వ్వాలని పట్టుదలతో నిరంతర అధ్యయనం ద్వారా మెదడును పాజిటివ్ థింకుతో అలవాటు చేసుకో వాలన్నారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకొని ఇంటి వాతావరణాన్ని మరిపించి, వారికి విద్యతో పాటు క్రీడలు, తండ్రి దండ్రులు లేని లోటును ఉపాధ్యాయులు తీర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కెరీర్‌అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ అలీషా, ప్రిన్సిపల్ అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

టిడిపి మండల సీనియర్ నాయకుడు తాటి గుంట్ల శ్రీధర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని టిడిపి నాయకుడు ధర్మారెడ్డి, ఆంజనేయులు కార్యకర్తలు ఆయన స్వగృహంలో బుధవారం కేక్‌కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పేదలకు, బడుగు బల హీన వర్గాలకు ముందుండి సహాయం అందించే మంచి వ్యక్తి శ్రీధర్‌రెడ్డి అని కొని యాడారు. కోట్లు విలువ చేసే స్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దానంగా ఇవ్వ డం వారి కుటుంబం ఘనతనేని చెప్పారు. అనంతరం ప్రాథమిక వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిసి రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట గ్రామపంచాయతీ రామకృపల్లి దళితవాడలో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు ఎంపిడిఒను కోరారు. భారీగా కురు స్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ఆ గ్రామాన్ని ఎంపిడిఒ జయశ్రీ సందర్శించి రోడ్డు పక్కన చిన్న కాలువ చేయడం ద్వారా ప్రస్తుతానికి నీరు నిల బడకుండా చర్యలు తీసుకున్నారు. స్థానిక ప్రజలు రోడ్డు ఎత్తు పెంచడం వల్ల నీరు సిసి రోడ్డు మంజూరు చేయాలని ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. సిసి రోడ్డు లేకపోవడంతో వర్షం వచ్చిన ప్రతి సారి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సిసి రోడ్డు ఏర్పాటు చేస్తే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అప్పయ్య రాజుపేట ఉపసర్పంచ్ సయ్యద్‌ముస్తాక్, ఎఇ పీఆర్, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య పాల్గొన్నారు.

యాసిడ్ తాగి కార్మికురాలికి అస్వస్థత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నీళ్లనుకుని యాసిడ్ తాగిన కార్మికురాలు తీవ్ర అస్వస్థత కు గురైంది. ఈ సంఘటన బుధవారం బి.కొత్తకోట మండల కేంద్రంలో జరిగింది. బాధితురాలి కుటుం బ సభ్యుల కథనం మేరకు..బి.కొత్తకోట బస్టాండ్ సమీపంలో నివాసముంటున్న గంగు లప్ప భార్య పాపులమ్మ స్థానిక మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా పనులు చేస్తోంది. ఉదయాన్నే విధులకు వెళ్లి పనులు ముగించుకుని ఇంటికి వచ్చింది. దా హంగా ఉండడంతో నీళ్లనుకొని పొరపాటున యాసిడ్ తాగింది. తీవ్ర అస్వస్థతకు గురైన కార్మికురాలిని కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రభు త్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

కోళ్ల ఫారాల్లో శుభ్రత పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో కోళ్ల ఫారాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు కోళ్ల ఫారాల వద్ద పరిశుభ్రతను పాటించాలని, పరిశుభ్రత పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం రాచవేటివారిపల్లె పంచాయతీ పరిధిలోని కోళ్ల ఫారాలను డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలసి తనిఖీ చేశారు. గ్రామాలకు సమీపంలో కోళ్ల ఫారాలు ఉన్నందున ఈగలు అభివృద్ధి చెందుతూ తరచూ గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయన్నారు. ఈగలు ఉధృతి వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కోళ్ల ఫారాల్లో క్రమం తప్పకుండా కోళ్ల వ్యర్థాలను శుభ్రపరచి బయట ప్రాంతాలకు తరలించాలన్నారు. కోళ్ల వ్యర్థాలను సక్రమంగా శుభ్రం చేయకుండా ఉండడంతోనే ఈగలు వృద్ధి చెంది ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కోళ్ల ఫారంలో ఈగల మందును పిచికారి చేయాలన్నారు. చనిపోయిన కోళ్లను గోతులు తీసి భూమిలో పాతి పెట్టాలని, బయట పడవేవద్దన్నారు. కోళ్ల ఫారాల నిర్వాహకులు అధికారుల ఆదేశాలను తప్పక పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు కూడా వారి పరిధిలోని కోళ్ల ఫారాలను తరచూ తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజిత, వైద్య ఆరోగ్య సిబ్బంది, కోళ్ల ఫారం నిర్వాహకులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు 15 నెలల జైలు శిక్ష

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

నిర్లక్ష్యంగా లారీని నడిపి ముగ్గురు ప్రాణాలను బలిగొన్న లారీ డ్రైవర్‌కు 15 నెలల జైలు శిక్ష విధిస్తూ మదనపల్లె ప్రిన్సిపల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సుభాన్ బుధవారం తీర్పు చెప్పారు. డిఎస్‌పి మహేంద్ర కథనం మేరకు.. 2021, ఫిబ్రవరి 12వ తేదీన మదనపల్లికి చెందిన శ్రీహరి, తరుణ్ కుమార్‌రెడ్డి, ధనుష్ ద్విచక్ర వాహనంలో శానిటోరియం వద్ద వెళుతుండగా, రాయచోటి పట్టణం, కొత్తపేట చెంది న మహబూబ్‌బాషా లారీని నిర్లక్ష్యంగా నడుపుతూ వీరిని ఢీకొన్నాడు. ఈ ప్రమా దం లో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. అప్పట్లో కేసు నమో దు చేసిన తాలూకా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. కేసు దర్యా ప్తులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణారెడ్డి కోర్టులో నేరం రుజువు చేయడంతో ముద్దాయికి 15 నెలల జైలుశిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి కోర్టు
(జూనియర్ డివిజన్): రాజంపేట
I.A.No: 502/2023
O.S.No:182/2023

కొమ్మన సుకుమార్ రెడ్డి, తండ్రి శంకర్ రెడ్డి, వయస్సు 45 సం., D.No:3/45-B, చొప్పావారిపల్లి, మజరా నాగవరం గ్రామం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా.
...పిటీషనర్/వాది
V/s
2.కొమ్మన అరుణ, భర్త శ్రీనివాసులు రెడ్డి, వయస్సు 36 సం., D.No:3/45-B, చొప్పావారిపల్లి మజరా, నాగవరం గ్రామం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా.
...2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది

పై తెలిపిన వాది, ప్రతివాదులైన కొమ్మన శ్రీనివాసులు రెడ్డి, కొమ్మన అరుణ మరియు ఇతరులపై కింద తెలిపిన షెడ్యూల్ దాఖలా ఆస్తిలో పర్మినెంట్ ఇంజక్షన్ కోరుచూ సివిల్ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) : రాజంపేట కోర్టులో I.A No: 502/2023, O.S No :182/2023 దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో పై తెలిపిన 2.వ ప్రతివాదికి ఏ విధమైన ఆక్షేపణలు ఉన్న యెడల 23.10.2025 వ తేదీన ఉదయం 10:30 గంటలకు సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్): రాజంపేట నందు హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడుదురు.

షెడ్యూల్
Enclosed in next page
//By order of the Court//
B. SHOBHA RANI,
Advocate,
RAJAMPET.

IN THE COURT OF THE HON'BLE V ADDITIONAL DISTRICT JUDGE: RAYACHOTY
I.A.No. 657 of 2025 in O.S.No. 2 of 2019

Between
R. Govindu Reddy. **...Petitioner/1st Defendant**
And
N. Prabhavathamma and others.
...Respondents/ Plaintiffs, 2nd defendant, proposed Defendant Nos.4 to 8
8. Goddindla Mohan Babu, son of G. Sreenivasulu, aged about 42 years, Hindu, resident of Kothavaddepalli, Polimerapalli, T. Sundupalli Mandal, Annamayya District.

NOTICE TO RESPONDENT NO.8

Please take notice that the petitioner has filed the above petition to implead you as respondent No.8, which stands posted to 27/10/2025 for your appearance, either by yourself personally or through advocate. If you fail to appear at 10.30 a.m. on the above said date, matter will be decided exparte.

M.SURESH KUMAR,
M.A., B.L.,
Advocate for petitioner/1st defendant

మహారాజశ్రీ సివిల్ జడ్జి కోర్టు
(జూనియర్ డివిజన్): రాజంపేట
O.S.No :182/2023

కొమ్మన సుకుమార్ రెడ్డి, తండ్రి శంకర్ రెడ్డి, వయస్సు 45 సం., D.No:3/45-B, చొప్పావారిపల్లి, మజరా నాగవరం గ్రామం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది
V/s
2.కొమ్మన అరుణ, భర్త శ్రీనివాసులు రెడ్డి, వయస్సు 36 సం., D.No:3/45-B, చొప్పావారిపల్లి మజరా, నాగవరం గ్రామం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా.
...2వ ప్రతివాది

పై తెలిపిన వాది, ప్రతివాది అయిన కొమ్మన శ్రీనివాసులు రెడ్డి, కొమ్మన అరుణ మరియు ఇతరులపై కింద తెలిపిన షెడ్యూల్ దాఖలా ఆస్తిలో భాగం కోరుచూ సివిల్ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్): రాజంపేట కోర్టులో O.S No: 182/2023 దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో రెండవ ప్రతివాదికి ఏ విధమైన ఆక్షేపణలు ఉన్న యెడల 23.10.2025 వ తేదీన ఉదయం 10:30 గంటలకు సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్): రాజంపేట నందు హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడుదురు.

షెడ్యూల్
Enclosed in next page
//By order of the Court//
B. SHOBHA RANI,
Advocate, RAJAMPET.